## క్లుప్తంగా

### కూలిన విద్యుత్ స్తంభం



ప్రమాదానికి కారణమైన వ్యాన్‌లో పశువులు

భామిని: ఒడిశా నుంచి పశువులను అక్రమంగా తరలిస్తున్న వ్యాన్ మణిగ సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో కూలిపోయింది. విద్యుత్ వైర్లు నేలకు తాకాయి. వెంటనే స్థానికులు సబ్‌స్టేషన్‌కు ఫోన్ చేసి కరెంటు సరఫరా నిలిపివేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

### భారీ అన్న సమారాధన



అన్న సంతర్పణలో పాల్గొన్న భక్తులు

వీరఘట్టం: స్థానిక పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం నిర్వహించిన మారు ఉత్సవంలో ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఇందులో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేసింది.

### ఉత్తమ విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు

భామిని: మండలంలోని బాలేరు జెడ్పీహెచ్‌సీ స్కూల్ పదో తరగతి విద్యార్థిని కేవటి రేవతి 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలవడంతో ఆమెను పలువురు మంగళవారం అభినందించారు. రేవతితో పాటు 500 పైబడి మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు. హెచ్‌ఎం జామి రమేష్ ఆధ్వర్యంలో ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్తకోట ఆంజనేయులు సన్మానించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ రెన్యువల్ చేయించాలి

సాలూరు: స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ చేయించుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జేవీఎస్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ రెన్యువల్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సాలూరు ఎంవీఐ పరిధిలో గల సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల బస్సుల యాజమాన్యం ఈ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలని స్పష్టం చేశారు. ఫిట్‌నెస్‌లేని బస్సులపై ప్రభుత్వం తీసుకునే చర్యలకు యాజమాన్యం బాధ్యులు కావాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

### 18న మూడు వాహనాల వేలం

సీతానగరం: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు మోటారు సైకిళ్లు, ఒక ఆటోను డిప్యూటీ కమిషనర్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (విశాఖ)వారి ఆదేశాల మేరకు విజయనగరం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరెంటెండెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 18న సీతానగరం ఎస్‌ఈబీ స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ పీడీ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు.

# 'ఉపాధి' పనులపై సామాజిక తనిఖీ

- లోపాలను సరి చేసుకోవాలని హెచ్చరిక
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు
- డ్వామా పీడీ రామచంద్రరావు




ప్రజావేదికలో పాల్గొన్న డ్వామా పీడీ రామచంద్రరావు

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీలలో చేట్టిన ఉపాధి హామీ పథకం పనులలో లోపాలను గుర్తించేందుకే సామాజిక తనిఖీలను నిర్వహించడం జరుగుతుందని డ్వామా పీడీ కె.రామచంద్రరావు అన్నారు. మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పంచాయతీలలో గుర్తించిన లోపాలను తక్షణమే సరిచేసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవన్నారు. గ్రామ సచివాలయాలలో పని చేస్తున్న వలంటీర్లు వారానికి మూడు రోజులు మాత్రమే పనులలో పాల్గొనాలన్నారు. ఉల్లిబద్ర గ్రామ పంచాయతీలో చేపట్టిన ఎన్ఆర్ఈజీఎస్ పథకం పనులకు సంబంధించి ఫీల్డు అసిస్టెంట్ వద్ద రికార్డులు లేకపోవడంతో పీఈ రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనదారుల జాబ్‌కార్డులు అప్‌లోడ్ కాకపోవడం, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. పనులు నిర్వహించిన చోట నేమ్ బోర్డులు ఏర్పాటు చేయలేదని సామాజిక తనిఖీ బృందం సభ్యులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎఫ్‌టీఓలను సకాలంలో జనరేట్ చేయకపోవడంతో వేతనదారులకు సకాలంలో బిల్లులు అందడంలేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు తెలియజేశారు. గతంలో నిర్మాణం చేపట్టిన గోశాలల బిల్లులు అందలేదని పలువురు పీడీ దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎంపీపీ ఉరిటి రామారావు, జిల్లా ఉపాధి హామీ పథకం విజిలెన్స్ అధికారి ఎస్.రవీంద్ర, ఏపీడీ జి.శ్రీహరిరావు, మాజీ ఎంపీపీ డి.ధనుంజయరావు ఎంపీడీఓ జి.పైడితల్లి పాల్గొన్నారు.

# డెంగీ నివారణపై అవగాహన

సీతంపేట: జాతీయ డెంగీ నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్ఎంఓ గౌరీశంకర్ ఆధ్వర్యంలో డెంగీ నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మనోజ్‌కుమార్, అమృత, శివకుమార్, రేఖ, సీతారామయ్య, భాగ్యశ్రీ, నర్సింగ్ సూపరెంటెండెంట్ సృజన తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని తాడికొండ గ్రామంలో పీహెచ్‌సీ వైద్య సిబ్బంది వైద్యాధికారి ఎం.బుద్ధేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ఆర్బో వైరస్ తరగతికి చెందిన నాలుగు రకాల డెంగీ వైరస్‌ల వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందని, ఇది మనిషి నుంచి మనిషికి దోమ కాటు ద్వారా వ్యాప్తి చెందుతుందని పేర్కొన్నారు. ర్యాలీలో సూపర్‌వైజర్లు శ్రీను, యారాయమ్మ, సింహాచలం, హెల్త్ అసిస్టెంట్లు నిమ్మకూరి రత్నప్రసాద్, ప్రకాష్, రాజేష్, ఏఎన్‌ఎంలు ప్రభావతి, ధనలక్ష్మీ, అర్చన తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో డెంగీపై అవగాహన ర్యాలీ



డెంగీపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

# సాగులో నవధాన్యాల పాత్ర కీలకం

- ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం షన్ముఖరాజు



రైతులకు నవధాన్యాల కిట్లను అందజేస్తున్న డీపీఎం షన్ముఖరాజు

గుమ్మలక్ష్మీపురం: రైతులు ఆర్థికాభివృద్ధి చెందడానికి నవధాన్యాల పాత్ర కీలకమని ఏపీ సీఎన్ఎఫ్ డీపీఎం పి.షన్ముఖరాజు అన్నారు. మండలంలోని చాపరాయి బిన్నిడి గ్రామంలో సీఎన్ఎఫ్, జట్టు సంస్థ సంయుక్తంగా మంగళవారం 40 మంది రైతులకు నవధాన్యాల కిట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డీపీఎం రైతులతో మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భూమిని సారవంతం చేసుకోడానికి, ఆరోగ్యకరమైన పంటలు పండించుకోడానికి, ఖర్చులు తగ్గించుకోడానికి ప్రతీ ఒక్క రైతు నవధాన్యాలను (20 నుంచి 30 రకాల విత్తనాలను ఒక ఎకరాకు 10 కేజీల చొప్పున్న) తొలకరికి ముందు వేసుకోవాలన్నారు. దీని వలన ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. నవధాన్యాల సాగు వలన భూమి సమృద్ధిగా సారవంతం అవుతుందన్నారు. ప్రధాన పంటలకు పోషకాలు పుష్కలంగా అందుతాయని, పంటల దిగుబడి పెరిగి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎం.దివ్యభారతి, ఎంపీటీసీ ఎం.శ్రీలక్ష్మీ, ప్రకృతి వ్యవసాయం డివిజన్ ఇన్‌చార్జి జి.అన్నపూర్ణ, ఎం.టి.జి.నిర్మలాదేవి, మండల ఇన్‌చార్జి ఎం.సీతారాం, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ఆర్థిక స్వావలంబన సాధించాలి

- ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం



చాపరాయి బిన్నిడిలో గ్రావిటీ స్కీంను ప్రారంభిస్తున్న ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులు ఆర్థిక స్వావలంబన సాధించుకోవాలని ఏపీ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని రాయగడజమ్ము గ్రామంలో అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో జట్టు ట్రస్టు ద్వారా ఏర్పాటు చేసిన మాతోట లబ్ధిదారుల క్షేత్రంలో ఏర్పాటు చేయనున్న బోర్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. చాపరాయి బిన్నిడి గ్రామంలో గ్రావిటీ ఇరిగేషన్ ప్రాజెక్టును కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన గిరిజన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న వివిధ పథకాలను ప్రజలు సమర్థవంతంగా వినియోగించుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. అనంతరం ఆయన మాతోట కార్యక్రమంలో భాగంగా సాగులో ఉన్న మామిడి, సపోట, జీడి తదితర అంతర పంటలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట జట్టు ట్రస్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, సీఎన్ఎఫ్ డీపీఎం పి.షన్ముఖరాజు, సర్పంచ్ ఎం.దివ్యభారతి, ఎంపీటీసీ ఎం.శ్రీలక్ష్మి, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, రైతులు పాల్గొన్నారు.

# మస్తర్లు సక్రమంగా వేయాలి



ఉపాధి వేతనదారులకు సూచనలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పాలకొండ రూరల్: ఉపాధి పనులు నిర్వహిస్తున్న చోట వేతనదారులకు అందించే పనులకు సంబంధించి మస్తర్లు సక్రమంగా వేయాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. పాలకొండ మండలం గోపాలపురం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. అక్కడి వేతనదారులతో మాట్లాడి వారిక అందుబాట్లో ఉన్న వసతులపై ఆరా తీశారు. హాజరు పట్టి, ఫీల్డ్ సహాయకుల పనితీరు పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

# వేగవంతంగా జగనన్న ఇళ్ల నిర్మాణాలు



మాట్లాడుతున్న అదనపు పీడీ రమేష్

పాలకొండ రూరల్: జగనన్న కాలనీలో లబ్ధిదారులచే గృహనిర్మాణాలు వేగవంతం చేయించాలని ఆ శాఖ అదనపు పీడీ రమేష్ అన్నారు. మంగళవారం పాలకొండ వచ్చిన ఆయన హౌసింగ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమావేశమయ్యారు. పట్టణ పరిధిలో వార్డుల వారీగా లబ్ధిదారులు, వారు చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల తాజా స్థితిగతులు, బిల్లుల చెల్లింపు, నిర్మాణదారులు అందిస్తున్న ఫిర్యాదులు, వాటి పరిష్కార చర్యలపై సమీక్షించారు. నిర్ణీత కాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ మాధవరావు తదితరులున్నారు.

# ప్రభుత్వ పెన్షనర్లు ఈకేవైసీ చేయించుకోవాలి



విశ్రాంత ఉద్యోగి ఇంటికి వెళ్ల ఈకేవైసీ నమోదు చేస్తున్న ఎస్టీఓ శ్రీనివాసరావు, సిబ్బంది

కురుపాం: ప్రభుత్వ పెన్షనర్లు ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కురుపాం ఉప ఖజానా అధికారి కాపు శంకరరావు తెలిపారు. కార్యాలయం పరిధిలోని జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ఇంటికి మంగళవారం నేరుగా వెళ్లి ఈకేవైసీ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యాలయం పరిధిలో 787 మంది విశ్రాంత ఉద్యోగులు ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 562 మంది మాత్రమే నమోదు చేసుకున్నారని ఇంకా 225 మంది పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లు ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉందని, వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోషియేషన్ సభ్యులు దాలినాయుడు, పాండు రంగారావుతో పాటు ఉపఖజానా కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# దోమల నివారణ మందు పిచికారీ



స్ప్రేయింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: గిరిజన గ్రామాల్లో దోమల నివారణ మందు పిచికారీ ప్రారంభమైంది. మండలంలోని మర్రిపాడు పీహెచ్‌సీ పరిధిలో పూతికవలస, పుత్తిగాం, రేగులగూడ గ్రామాల్లో మంగళవారం తొలిరోజు ఇళ్లల్లో స్ప్రేయింగ్ చేశారు. సబ్ యూనిట్ అధికారి జె.మోహన్‌రావు, మర్రిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిచరణ్ పర్యవేక్షించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి స్ప్రేయింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ ఝాన్సీ పాల్గొన్నారు.

# నవధాన్యాల సాగుపై అవగాహన



నవధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

సీతంపేట: మండలంలోని కుడ్డపల్లి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులకు నవధాన్యాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మంగళవారం అవగాహన కల్పించారు. వీఏఏ లావణ్య ఆధ్వర్యంలో నవధాన్యాల విత్తనాలు పంపిణీ చేశారు. వీటిని సాగు చేయడం వలన నేల సారం పెరుగుతుందన్నారు. భూమిలో కర్బన శాతం ఎక్కువవుతుందన్నారు. కార్యక్రమంలో యాంకర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రమదానంతో రహదారి పనులు



రహదారి మరమ్మతులు చేస్తున్న వజ్జాయిగూడ గిరిజనులు

సీతంపేట: చేయిచేయి కలిపి శ్రమదానం చేసి రహదారి మరమ్మతులు చేపడుతున్నారు. మండలంలోని వజ్జాయిగూడ గిరిజనులు రహదారి పూర్తిగా పాడవడంతో అత్యవసర సమయాల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే అటవీ ఉత్పత్తులు మార్కెట్‌కు తీసుకువెళ్లాలన్నా ఇబ్బందులు పడాల్సిందే. రహదారిలో పెద్దపెద్ద రాళ్లు ఉండడంతో కొద్ది నెలల కిందట వ్యాన్ బోల్తా పడిన సంఘటనలో 41 మందికి గాయాలయ్యాయి. ఇలా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటడంతో గ్రామస్తులంతా రహదారి మరమ్మతు చేయడానికి ముందుకు వచ్చారు. పూర్తిస్థాయిలో రహదారి నిర్మించేలా ఐటీడీఏ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## యంత్ర సేవా పథకం రైతులకు వరం

గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్సార్ యంత్ర సేవా పథకం రైతుల పాలిట వరమని గుమ్మలక్ష్మీపురం మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అడ్డాకుల చిన్నారావు పేర్కొన్నారు. గుమ్మలక్ష్మీపురంలో విలేకర్లతో ఆయన మంగళవారం మాట్లాడారు. ప్రస్తుతం పథకం అమలుకు అనుసరిస్తున్న ఆర్థికపరమైన నిబంధనలు కారణంగా మైదానపు ప్రాంతాల రైతులు లబ్ధి పొందుతున్నంతగా.. ఏజెన్సీ ప్రాంతాల్లో గల గిరిజన రైతులు ఈ పథకపు సేవలకు చేరువ కాలేకపోతున్నారని పేర్కొన్నారు. పథకం నిబంధనలు సవరించాలని తద్వారా గిరిజన రైతులకు ఈ పథకం సేవలు చేరువ అయ్యేలా చూడాలని అధికారులను కోరారు.

## కచ్చితంగా హద్దురాళ్ల ఏర్పాటు

పాలకొండ: గ్రామాల్లో సరిహద్దు రాళ్లు సక్రమంగా వేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. మండల సర్వేయర్లు, వీఆర్వోలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని గ్రామాల వారిగా రాళ్ల ఏర్పాటుపై సమీక్షించారు. రైతుల సమక్షంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా రాళ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య ఉన్నారు.

## శరవేగంగా జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు

- రూ. 1.34 కోట్ల బిల్లుల చెల్లింపు
- మండల సర్వసభ్య సమావేశంలో ఏఈఈ



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ ఏఈఈ ప్రభాకర్

భామిని: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయని గృహ నిర్మాణ శాఖ ఏఈఈ ఎల్.ప్రభాకరావు వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోట శాంతి కుమారి అధ్యక్షతన ఎంపీడీఓ గుర్ల కృష్ణారావు ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశంలో హౌసింగ్ శాఖపై పలువురు సభ్యులు సమస్యలు లేవనెత్తారు. దీనిపై ఏఈఈ మాట్లాడుతూ ఇప్పటికే 266 పీఎంఏవై గృహాలు నిర్మాణంలో ఉండగా వాటికి రూ.కోటి 34లక్షల మేరకు బిల్లుల చెల్లింపులు సాగుతున్నాయని చెప్పారు. మండలంలో మంజూరు చేసిన జగనన్న కాలనీ లేఅవుట్ల ఇళ్ల స్థలాలపై ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ ప్రశ్నించారు. లేఅవుట్లలో జియో ట్యాగింగ్ చేయడానికి కలుగుతున్న ఇబ్బందుల పరిష్కారానికి ఇతర శాఖల అధికారులు సహకరించాలని హౌసింగ్ ఏఈఈ కోరారు. వీఈఓలకు ప్రజాప్రతినిధులు సహకరించి ఆక్రమణలు తొలగింపు, జంగిల్ క్లియరెన్స్‌లు చేయించాలని కోరారు. గతంలో ఇచ్చిన లేఅవుట్ల పట్టాల మేరకు లబ్ధిదారులకు అప్పగింతలో వచ్చిన అడ్డంకులు వివరించారు. గృహ నిర్మాణానికి అవసరమైన ఇసుక తరలింపులో అడ్డంకులపై ప్రత్యేక ఆహ్వానితులు కొవ్వాడ చిరంజీవులు, అగతముడి రఘు నిలదీశారు. అకాల వర్షాలకు 114 మంది రైతులు చెందిన 48.29 హెక్టార్లలో పంట నష్టం గుర్తించి 5.25 లక్షల రూపాయల పరిహారానికి ప్రతిపాదించినట్లు వ్యవసాయాధికారి కె.సింహాచలం తెలిపారు. మొక్కజొన్న కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సిద్ధంగా ఉందన్నారు. ఖరీఫ్‌కు అవసరమైన విత్తనాలు, ఎరువులు ముందుగానే సిద్ధం చేశామన్నారు. వడ్డంగి, చిన్నదిమిలిలో గతంలో నిర్మించిన వాటర్ ట్యాంకుల బిల్లులు చెల్లించలేదని సర్పంచ్ రవికుమార్ తెలిపారు. హౌసింగ్ సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని ఎంపీపీ శాంతికుమారి, ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం చెప్పారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# డెంగీని తరిమికొడదాం...

జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య శాఖ ఆధ్వర్యంలో పీహెచ్‌సీల పరిధిలో అవగాహన ర్యాలీలు మంగళవారం పలుచోట్ల జరిగాయి. అవగాహనతోనే డెంగీని అడ్డుకోగలమని పలువురు వైద్యులు సూచించారు. పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీని అడ్డుకట్ట వేయగలమని పేర్కొన్నారు. ర్యాలీలో వైద్య సిబ్బందితో పాటు ప్రజలు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: డెంగీపై అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ వైద్య సిబ్బంది



పాలకొండ: అన్నవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది




భామిని: బత్తిలిలో డెంగీపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది




పాలకొండ రూరల్: నగర పంచాయతీలో డెంగీ అవగాహన ర్యాలీ